సాక్షి
అనంతపురం
గురువారం । 5 । అక్టోబర్ । 2023



## చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



## టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.3°/22.5°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి వర్షం కురిసింది.

## న్యూస్‌రీల్

### ప్రశాంతంగా ఎఫ్‌ఏ-2 పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్‌: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 1–10 తరగతుల విద్యార్థులకు రెండు రోజులుగా ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)–2 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు బుధవారం బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇంగ్లిష్ భాషలో విద్యార్థుల ప్రతిభను చూసి డీఈఓ అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలూ కల్పిస్తోందన్నారు. విద్యార్థులందరూ బాగా చదువుకునేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. హెచ్‌ఎం, టీచర్లు సమన్వయంగా ఉంటూ పిల్లలను తీర్చిదిద్దాలని సూచించారు.

### సజావుగా కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్‌: డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్టాఫ్‌నర్సు పోస్టుల నియామక కౌన్సెలింగ్ సజావుగా జరిగింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి వివిధ ఆస్పత్రులకు సీనియారిటీ ప్రాతిపదికన పోస్టింగ్‌లు కేటాయించారు. నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో ఏరియా, సీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న 65 పోస్టులకు 51 మందిని మెరిట్ ఆధారంగా పిలవగా, అందులో 32 మందికి పోస్టింగ్ ఇచ్చినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చెన్నకేశవులు, పరిపాలనాధికారి గిరిజ మనోహర్, సూపరింటెండెంట్ విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### జిల్లాకు 1,155 మెట్రిక్ టన్నుల ఎరువులు



అనంతపురం అగ్రికల్చర్‌: ఎరువుల ప్రణాళికలో భాగంగా బుధవారం జిల్లాకు 1,155 మెట్రిక్ టన్నులు సరఫరా అయినట్లు వ్యవసాయ శాఖ ఏడీ ఎం.రవి తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింటుకు వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులను ఆయన పరిశీలించారు. ఫ్యాక్ట్ కంపెనీ నుంచి 1,028 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం కాంప్లెక్స్‌తో పాటు 127 మెట్రిక్ టన్నుల అమ్మోనియం సల్ఫేట్ వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొదటి ప్రాధాన్యత కింద ఆర్‌బీకేలు, సొసైటీలు, అలాగే ఇండెంట్ ప్రకారం ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామని తెలిపారు.

### నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు–1, 3, 7 (ఆర్థిక/ప్రణాళిక, వ్యవసాయం/ఇంజినీరింగ్) సమావేశాలు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జరిగే సమావేశాలకు ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్, ఆయా స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు హాజరు కానున్నారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలకు సంబంధించి సమగ్ర వివరాలతో హాజరు కావాలని సంబంధిత అధికారులను ఇప్పటికే ఆదేశించారు.

# న్యాయం మీరే చెప్పండి

- 8న అనంతపురంలో 'ధర్మ సంకల్ప' సభ
- వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల భారీ ర్యాలీ
- చంద్రబాబు దోపిడీ, న్యాయవ్యవస్థ పరిణామాలపై ప్రజల సమక్షంలో చర్చ
- హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ధర్మ సంకల్ప సభ నిర్వహణపై చర్చిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా, ఏడీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరా

అనంతపురం ఎడ్యుకేషన్‌: టీడీపీ హయాంలో ప్రజాధనం దుర్వినియోగం చేయడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కుపోయేలా చేశారు. 'స్కిల్' స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికి కూడా గగ్గోలు పెడుతున్నారు. తాము చట్టాలకు, వ్యవస్థలకు అతీతులం.. చట్టం తమను శిక్షించకూడదు అన్నట్లు వ్యవహరిస్తూ సానుభూతి కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. చంద్రబాబు హయాంలో జరిగినటువంటి ప్రజాధనం దోపిడీని, న్యాయ వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను గమనించి న్యాయం మీరే చెప్పండి అంటూ 'ధర్మ సంకల్ప సభ' పేరుతో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 8న అనంతపురంలో ఆర్ట్స్ కళాశాల నుంచి భారీ ర్యాలీ చేసి, సప్తగిరి సర్కిల్‌లో సభ నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

**ప్రజాప్రతినిధుల భేటీ**

'ధర్మ సంకల్ప' సభ నిర్వహణ ఏర్పాట్లపై చర్చించేందుకు బుధవారం సాయంత్రం అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సమావేశమయ్యారు.

**సానుభూతి కోసం ప్రతిపక్ష పార్టీ తంటాలు**

స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, అయితే సానుభూతి కోసం టీడీపీ తంటాలు పడుతోందని సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించారు. చంద్రబాబు తప్పులను కప్పి పుచ్చేందుకు ఎల్లో మీడియా విష ప్రచారానికి దిగిందన్నారు. తప్పు చేసి జైలుకెళ్లి.. ప్రభుత్వాన్ని నిందించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు స్కాములు, దోపిడీ వ్యవహారాలను ప్రజలకు వివరిస్తామన్నారు. చంద్రబాబుకు శిక్ష వేసింది ప్రభుత్వాలు కాదు కోర్టులు అనేది ప్రజలకు తెలియజేస్తామన్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక చంద్రబాబు హయాంలో జరిగిన అన్ని దోపిడీలు బయటపెట్టి ప్రజామద్దతు కోరనున్నట్లు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు వెల్లడించారు.

### అర్జీలు త్వరగా పరిష్కరించాలి



ప్రజల సమస్యలు వింటున్న జేసీ కేతన్ కార్గ్

విడపనకల్లు: ప్రజల నుంచి అందిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని జేసీ కేతన్ గార్గ్ ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జేసీ అధ్యక్షతన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి మొత్తం 31 అర్జీలు అందాయి. హావళిగి గ్రామంలో 20 మంది పైగా బసివినులు ఉన్నారని, వారికి స్థలాలు చూపి ఇళ్లు మంజూరు చేయడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజమ్మ, కురుబ కళావతి, సర్పంచు గీతమ్మలు జేసీని కోరారు. సాగు చేసుకోవడానికి భూములు చూపాలన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో విడపనకల్లు మండల కేంద్రంలో నిరుపేదల కోసం భూమి సేకరించారని, అయితే టీడీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు, వారి అనుచరులకు ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు పట్టాలు తీసుకున్నారని ఎంపీపీ పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, మాజీ సర్పంచు భీంరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు సుంకన్న తెలిపారు.

# పరిశ్రమలతో సమగ్రాభివృద్ధి

- జాజరకల్లు వద్ద రూ.544 కోట్లతో ఇథనాల్ పరిశ్రమ
- వర్చువల్‌గా భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- పరిశ్రమ ఏర్పాటుతో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి



ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి, లిఖిత, మీసాల రంగన్న, పరిశ్రమ ప్రతినిధులు తదితరులు

అనంతపురం అర్బన్‌: పరిశ్రమల స్థాపనతో జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. ఆ దిశగానే ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి డి.హీరేహాళ్ మండలం జాజరకల్లు వద్ద ఎకో స్టీల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.544 కోట్లతో నెలకొల్పుతున్న మొక్కజొన్న, బియ్యం నూక ఆధారిత ఇథనాల్ డిస్టిలరీ పరిశ్రమకు వర్చువల్‌గా భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి ప్రభుత్వ విప్, కలెక్టర్‌తో పాటు రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని విప్, కలెక్టర్, పరిశ్రమ ప్రతినిధులు ఆవిష్కరించారు. విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నారన్నారు. ఇందుకు గ్లోబెల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్లో జరిగిన అవగాహన ఒప్పందాల మేరకు నేడు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న 9 పరిశ్రమలకు సంబంధించి భూమి పూజ, ప్రారంభోత్సవాలను ముఖ్యమంత్రి చేశారన్నారు. అందులో భాగంగానే జాజరకల్లు వద్ద ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు సీఎం వర్చువల్‌గా భూమిపూజ చేశారని, ఇది తమ అదృష్టమని అన్నారు.

**పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట**

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ గౌతమి అన్నారు. జిల్లాలో ఇథనాల్ ఇంధనం తయారీ పరిశ్రమ నెలకొల్పడం సంతోషదాయకమన్నారు. ఎకో స్టీల్ ఇండియా లిమిటెడ్ వారికి ప్రభుత్వ, జిల్లా యంత్రాంగం నుంచి సంపూర్ణ సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

**ప్రభుత్వ సహకారం బాగుంది**

జిల్లాలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిందని ప్రాజెక్టు మేనేజర్ సుబాన్ అన్నారు. పరిశ్రమ ఏర్పాటు, అనుమతులకు కలెక్టర్ తోడ్పాటు అందించారన్నారు. జిల్లా పరిశ్రమలు, భూగర్భ జల, వాటర్ రీసోర్స్, ఫ్యాక్టరీస్ శాఖల అధికారులు తగిన సహకారమందిస్తున్నారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

**వేలాది మందికి ఉపాధి అవకాశాలు**

ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా 500 మందికి ఉద్యోగ అవకాశాలు, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ పరిశ్రమలో రోజుకు 400 కిలో లీటర్ల ఇథనాల్ ఇంధనం తయారు చేసేందుకు 12 మెగావాట్ల కో–జనరేషన్ పవర్ ప్లాంట్ నెలకొల్పుతున్నారన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. మొక్కజొన్నకు సకాలంలో మార్కెట్ లభించడంతో పాటు గిట్టుబాటుధర దక్కుతుందన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. వెనుకబడిన రాయదుర్గం ప్రాంతంలో పరిశ్రమ నెలకొల్పుతున్న కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం నాగరాజారావు, ఎల్‌డీఎం సత్యరాజ్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, ఎకో స్టీల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ అజయ్ ప్రసాద్, ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ ముకేష్ కుమార్ వర్మ, ప్రాజెక్టు మేనేజర్ సుబాన్, తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావంతో విధులు నిర్వర్తించండి

- ఎస్పీ అన్బురాజన్ ఆదేశం



'దిశ' స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. బుధవారం నగరంలోని దిశ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మహిళా ఫిర్యాదులపై తక్షణం స్పందించాలన్నారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయం అందించాలని సూచించారు. కాపురాలు విడిపోకుండా సఖ్యతగా ఉండేలా దంపతులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అలా కాకుండా వారి పట్ల దురుసుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. ఈవ్‌టీజింగ్ వేధింపులకు గురయ్యే ప్రదేశాల్లో నిఘా పెట్టాలన్నారు. కట్నం వేధింపులు, కిడ్నాపులు, బాల్య వివాహాలు, ర్యాగింగ్‌ల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి చైతన్యం తీసుకురావాలన్నారు. దిశ పోలీసు స్టేషన్ లక్ష్యాన్ని నెరవేర్చేదిశగా మీ సేవలుండాలన్నారు. మహిళల సంచారం అధికంగా ఉండే ప్రదేశాలు, రహదారులపై విజిబుల్ పోలీసింగ్ ఉండాలన్నారు. దిశ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలు, ఈవ్‌టీజింగ్‌లాంటి చట్ట విరుద్ధ చర్యలు జరుగుతుంటే వెంటనే తన నంబర్ 9440796800కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

**అత్యవసర నంబర్లు అందుబాటులో ఉంచాలి**

ప్రజల సౌకర్యార్థం కేటాయించిన అత్యవసర నంబర్లను అందుబాటులో ఉంచాలని ఎస్పీ సూచించారు. ఉమెన్స్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు హెల్ప్‌లైన్ 112, 100, జిల్లా స్పందన 9392926803, సీఎంఓ స్పందన 1902, జిల్లా ఎస్పీ 94407 96800, అంబులెన్స్ 108, వైద్యసేవలు 104, అగ్నిమాపకశాఖ 101, ఆత్మహత్యలకు పాల్పడకుండా అవగాహన కల్పించే కేంద్రం 14400, సైబర్ మోసాలపై 1930, సైబర్ మిత్ర 91212 11100, ఎల్‌హెచ్‌ఎంఎస్ 93469 17100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో 'దిశ' డీఎస్పీ ఆంథోనప్ప, సీఐ చిన్న గోవిందు, ఎస్‌ఐ ఆశాబాను, సిబ్బంది పాల్గొన్నారు.

### బాలల సంక్షేమానికి కృషి

అనంతపురం క్రైం: అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల సంక్షేమానికి కృషి చేద్దామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని బాలల సంక్షేమ పోలీసు అధికారులకు నగరంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు పిల్లలకు సంబంధించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జేజేబీ ముందు హాజరు పెట్టే సమయంలో పోలీసు అధికారులు తప్పనిసరిగా యూనిఫాంలో కాకుండా సివిల్ దుస్తుల్లో ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పిల్లలను పోలీసు స్టేషన్‌లో ఉంచకూడదన్నారు. బేడీలు వేయరాదని, తప్పిపోయిన బాలల విషయంలోనూ, అఘాయిత్యాలు జరిగినప్పుడు, బాల్య వివాహాల సందర్భాలలో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నుంచి యునిసెఫ్ ప్రతినిధి డేవిడ్‌రాజ్ బాలల న్యాయ చట్టం అమలులో పోలీసు పాత్ర అనే అంశంపై ఆన్‌లైన్ ద్వారా తర్ఫీదునిచ్చారు. అనంతపురం మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేఎల్ సుబ్రహ్మణ్యం సీపీఆర్‌పై డెమో క్లాస్ నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జేజేబీ సభ్యులు శ్రీనివాసులు, ఆదినారాయణ, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, ఐసీపీఎస్ అధికారులు చంద్రకళ, నాగలక్ష్మి, రాజేష్, షమీర్, వసంత, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి భానూజ, తదితరులు పాల్గొన్నారు.

# అభ్యసన సామర్థ్యం ఎంత?

- నవంబరు 3న జాతీయ స్థాయిలో పరీక్ష
- పరీక్ష రాయనున్న 3, 6, 9 తరగతి విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలలు 1,236
- మండలాల వారీగా 1,359 మంది ఇన్విజిలేటర్ల ఎంపిక



అనంతపురం ఎడ్యుకేషన్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. నాణ్యమైన విద్య అందిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన ప్రభుత్వాలు విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. నిపుణులతో పాఠ్యపుస్తకాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పాఠ్య పుస్తకాల బోధన ఏ మేరకు పిల్లలు అర్థం చేసుకుంటున్నారు.. ఏ సబ్జెక్టులో ఎంత మేరకు ఫలితాలు వస్తున్నాయి.. చదవడం, రాయడం తదితర అంశాల్లో సామర్థ్యాలను గుర్తించేందుకు జాతీయస్థాయిలో సర్వే జరగబోతోంది. కేంద్ర ప్రభుత్వం నేషనల్ అసెస్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పేరుతో, రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్‌ఈఏఎస్) పేరుతో నవంబరు 3న ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఒకేరోజు ఈ పరీక్ష జరుగుతోంది. అనంతపురం జిల్లాలో ఎంపిక చేసిన 1,236 అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్ష రాయబోతున్నారు. ఏ స్కూల్‌లో ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాస్తారనే వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. పరీక్ష ఓఎంఆర్ విధానంలో ఉంటుంది.

**ఏ తరగతికి ఏ సబ్జెక్టు అంటే...**

మూడో తరగతి, ఆరో తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, మాథ్స్, ఈవీఎస్, తొమ్మిదో తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, మాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు. మూడు, ఆరు తరగతి విద్యార్థులకు 40 ప్రశ్నలు, 60 నిమిషాల సమయం ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలు, 90 నిమిషాల సమయం ఉంటుంది. డిగ్రీ, డైట్, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారు. ఇప్పటికే మండలాల వారీగా 1,359 మంది ఇన్విజిలేటర్లను ఎంపిక చేశారు.

**చాలా ముఖ్యమైన పరీక్షలు**

నేషనల్ అసెస్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్), స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్‌ఈఏఎస్) పరీక్షలు చాలా ముఖ్యమైనవి, విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పరీక్షలను చేపడుతోంది.

– వి.నాగరాజు డీఈఓ

# జోరుగా 'ఆరోగ్య సురక్ష'

- జిల్లాలోని 21 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు
- 3,534 మందికి ఓపీ సేవలందించిన వైద్యులు



గూగూడులో వైద్యశిబిరానికి వచ్చిన వృద్ధురాలిని పలకరిస్తున్న శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అనంతపురం మెడికల్‌: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' హెల్త్ క్యాంపులుగా జోరుగా సాగుతున్నాయి. బుధవారం జిల్లాలోని 21 ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. 84 మంది స్పెషలిస్టులు, మెడికల్ ఆఫీసర్లు, వందలాదిమంది వైద్య సిబ్బంది హాజరై 3,534 మందికి ఓపీ సేవలందించారు. 154 మందిని ఆరోగ్య పరిస్థితిని బట్టి జిల్లా ఆస్పత్రి, నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

**పేదల ఆర్థికస్థితిగతులు మెరుగు**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు' పథకాల ద్వారా పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆర్థికస్థితిగతులను మెరుగుపర్చారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నారాయణపురంలో జరిగిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నార్పల మండలం గూగూడులో జరిగిన కార్యక్రమానికి శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా స్పెషలిస్టు వైద్యులతో కార్పొరేట్‌స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. రాప్తాడులోని గొందిరెడ్డిపల్లిలో జరిగిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఉరవకొండ మండలం లత్తవరం, పీసీపీ కొత్తకోటలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పామిడి మండలం గజరాంపల్లి మెడికల్ క్యాంపులో ఎంపీపీ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు. పామిడి మండలం గజరాంపల్లి, గార్లదిన్నె మండలం కల్లూరులో జరిగిన వైద్య శిబిరాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి పరిశీలించారు.

**నేడు 37 ప్రాంతాల్లో క్యాంపులు**

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలోని 37 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి తెలిపారు. 74 మంది స్పెషలిస్టు వైద్యులు, 74 మంది మెడికల్ ఆఫీసర్లు వైద్య సేవలందించనున్నట్లు వెల్లడించారు. ఎ.నారాయణపురం (అనంతపురం రూరల్), ముట్టాల, బొల్లనగుడ్డం, గుండిగానిపల్లి, చెన్నంపల్లి, డీ హీరేహాళ్, మర్తాడు, జక్కలచెరువు, తాళ్లకెర, మొలకలపెంటతండా, బేడరహళ్లి, కంబదూరు, హనకనహాళ్, ఇప్పేరు, జంబుగుంపల, దుగుమర్రి, అనుంపల్లి, రావులుడికి, కుమ్మనమల, హంపాపురం, మల్లాపురం, బచ్చేహళ్లి, వెస్ట్ నరసాపురం, ఆలూరు, ఆమిద్యాల, గూళ్యపాళ్యం, పాల్తూరు, నగరూరు, పెద్దమల్లేపల్లి వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల్లో, అనంతపురం మంగళవారి కాలనీ, గుంతకల్లు అంబేడ్కర్‌నగర్, టైలర్స్ కాలనీ యూపీహెచ్‌సీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### 12న రైల్వే సహకార సొసైటీ ఎన్నికలు



ప్రచారం చేస్తున్న ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

**గుంతకల్లు/గుత్తి:** దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్‌లోని రైల్వే ఉద్యోగుల సహకార సొసైటీ ఎన్నికలు ఈ నెల 12న గుంతకల్లులో జరగనున్నాయి. 17న జోనల్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 28 డెలిగేట్ సభ్యులు ఎన్నిక కానుండగా, అనంతరం వారు ఇద్దరు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఎన్నికల్లో సంఘ్, యూనియన్ తరఫున 28 మంది చొప్పున పోటీ పడుతున్నారు. దీంతో రెండు సంఘాల నాయకులు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. గుంతకల్లు రైల్వే డీఆర్ఎం కార్యాలయం, రైల్వేస్టేషన్, రైల్వే కాలనీల్లో ఎన్నికల్లో పోటీ చేసే డెలిగేట్ల ఫొటోలతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా, సొసైటీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉండగా, శాఖాపర కార్యాలయం గుంతకల్లులో ఉంది.

### అరటి చెట్ల నరికివేత



నరికివేసిన అరటి చెట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ గంగయ్య

**యాడికి:** గుర్తు తెలియని వ్యక్తులు ఓ తోటలోని 175 అరటి చెట్లు నరికి వేశారు. దాదాపు రూ. 50 వేల వరకూ నష్టం వాటిల్లింది. ఈ సంఘటన మండలంలోని లక్ష్మంపల్లెలో బుధవారం జరిగింది. ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపిన మేరకు.. లక్ష్మంపల్లె గ్రామానికి చెందిన బోయ లింగమయ్య కుమారుడు కుమార్ చందన తన రెండు ఎకరాల పొలంలో అరటి సాగు చేస్తున్నాడు. కొంత కాలంగా కుమార్ బావమ్మర్ది దాసరి పెద్దయ్య, జ్యోతి దంపతులు తరచూ గొడవ పడుతుంటే కుమార్ వెళ్లి ఇద్దరికీ సర్దిచెప్పేవాడు. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం తన తోటలోకి వెళ్లగా 175 చెట్లు నేలమట్టమై కనిపించాయి. డీఎస్పీ గంగయ్య, సీఐ శంకర్ రెడ్డి, ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్తులు, సర్పంచు పద్మనాభ రెడ్డితో ఆరా తీశారు. కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# వహ్వా అనేలా హాకీ ఆట

- హాకీ క్రీడలో రాణిస్తున్న సనప ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ
- దాతల చేయూతతో దూసుకెళ్తున్న వైనం

**ఆత్మకూరు:** మండలంలోని సనప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హాకీ ఆటలో దూసుకెళ్తున్నారు. హాకీ పేరు చెబితే జిల్లాలోనే సనప గుర్తొచ్చేంతలా ప్రతిభ చాటుతున్నారు. ఏటా జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన క్రీడాకారులు 10 నుంచి 15 మంది పాల్గొంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**రాటు దేలుస్తున్న పీడీ..**

2017 సంవత్సరంలో సనప పాఠశాలకు పీడీగా నాగరాజు వచ్చారు. అప్పటి నుంచి హాకీ క్రీడకు కేరాఫ్‌గా పాఠశాల గుర్తింపు తెచ్చుకుంది. నాగరాజు వచ్చినప్పటి ఇప్పటి వరకు దాదాపు 72 మంది రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. దీంతో పాటు ఫ్లోర్ బాల్, షూటింగ్ బాల్‌లో 15 మంది జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. క్రీడాకారులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నాగరాజు రాటు దేలుస్తున్నారు.

**ఎమ్మెల్యే చేయూత**

సనప విద్యార్థుల ప్రతిభ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తనవంతు చేయూతనిచ్చారు. ఇటీవల వంద హాకీ స్టిక్స్, వంద బాల్స్ వితరణ చేశారు. దీంతో పాటు ఆర్డీటీ సంస్థ కూడా ఏటా హాకీ స్టిక్స్, బాల్స్ అందిస్తోంది. సాధారణ రైతు కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీ పడుతుండడం చూసి పలువురు ఆశ్చర్యపోతున్నారు.



హాకీ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

**రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నా**



ప్రతి రోజూ పాఠశాల క్రీడామైదానంలో హాకీ ప్రాక్టీస్ చేస్తున్నాం. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి అండర్- 14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. పీడీ నాగరాజు ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతోనే ఆటల్లో రాణించేందుకు అవకాశం కలుగుతోంది. పాఠశాల ఉపాధ్యాయులు కూడా సహకరిస్తున్నారు.

– షర్మిల, 8వతరగతి

**క్రీడలకూ ప్రాధాన్యం**



మా పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యం ఉంటుంది. పరీక్షల సమయం మినహా ప్రతి రోజూ క్రీడలను ప్రాక్టీస్ చేస్తాం. ఉపాధ్యాయుల సహకారంతోనే హాకీ పోటీల్లో రాణిస్తున్నాం. మా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తుండడంతో మరింత బాగా ఆడేందుకు అవకాశం కలుగుతోంది.

– మునీశ్వరి, 8వ తరగతి

**పాఠశాలలో అన్ని సౌకర్యాలు**



మా అమ్మ, నాన్న తమకున్న కొద్దిపాటి పొలంలోనే వ్యవసాయం చేస్తూ నన్ను కష్టపడి చదివిస్తున్నారు. గతం కంటే ప్రస్తుతం పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అటు చదువులోనే కాకుండా హాకీ క్రీడలో రాణిస్తూ ముందుకు వెళ్తున్నా. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి సార్, ఆర్డీటీ వారు అందించిన చేయూత మరువలేనిది.

– హర్షవర్ధన్, 9వ తగరతి

**హాకీ అంటే చాలా ఇష్టం**



నాకు హాకీ ఆడటం అంటే చాలా ఇష్టం. క్రీడల ద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే నా ఆశ. అందుకే ప్రతి రోజూ ప్రాక్టీసు చేస్తున్నా. అండర్- 19 రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో త్వరలో పాల్గొంటున్నా. అక్కడ కూడా తప్పకుండా రాణిస్తా. మా తల్లిదండ్రులు, చదువు చెప్పిన మాస్టార్లు, పీడీ నాగరాజుకు మంచి పేరు తీసుకొస్తా.

–నందకిషోర్‌రెడ్డి, 9వ తరగతి

**మా ఊరికి ప్రత్యేక గుర్తింపు**



హాకీ క్రీడ ద్వారా మా ఊరికి ప్రత్యేక గుర్తింపు లభించింది. మా సీనియర్లు రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో ఆడారు. పాఠశాలకు, ఊరికి పేరు తీసుకొచ్చారు. వారి బాటలో పయనిస్తూ మేం కూడా బాగా ఆడుతున్నాం. కేవలం క్రీడలే కాకుండా చదువులోనూ రాణిస్తున్నాం. భవిష్యత్తులో మా పాఠశాల క్రీడాకారులు సీనియర్ జాతీయ జట్టుకు కూడా ఎంపికవుతారు.

– శైలజ, 8వ తరగతి

**ఎమ్మెల్యే స్ఫూర్తినింపారు**



సనప పాఠశాల విద్యార్థులు హాకీ క్రీడలో రాణిస్తున్నారనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేయూతనందించారు. మాలో స్ఫూర్తినింపారు. భవిష్యత్తులోనూ అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఆయన చేసిన సాయం మరువలేనిది. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.

– రజిత, 10వ తరగతి

**అందరి సహకారంతోనే..**



హాకీతో పాటు షూటింగ్‌బాల్, ఫ్లోర్ బాల్ పోటీల్లో కూడా మా విద్యార్థులు రాణిస్తున్నారు. 2017 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 70 మందికి పైగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులతో పాటు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సహకారం, గ్రామస్తుల అండ కూడా ఎంతో ఉంది. అందరి సహకారంతోనే విజయాలు సాధించేందుకు అవకాశం కలుగుతోంది.

– నాగరాజు, పీడీ

### 8న ఖోఖో జూనియర్ జట్ల ఎంపిక

**ఉరవకొండ:** స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 8న జిల్లా స్థాయి ఖోఖో జూనియర్ బాల, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, అధ్యక్షుడు వై.భీమిరెడ్డి, చైర్మన్ నర్రా కేశన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. 2006 జనవరి 1 పైన జన్మించిన వారు అర్హులన్నారు. అక్టోబర్ 20 నుంచి 22 వరకూ చిత్తూరు జిల్లా యాదగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఎంపికైన జట్లు పాల్గొంటాయని తెలిపారు. వివరాలకు 9966117447, 9493 360686 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

### బిహార్, తమిళనాడు విజయం

**అనంతపురం:** స్థానిక ఆర్డీటీ క్రీడా గ్రామంలో సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. బుధవారం బిహార్-ఉత్తరాఖండ్ రాష్ట్రాల మధ్య జరిగిన మ్యాచ్‌లో బిహార్ 7 గోల్స్ సాధించి, ఉత్తరాఖండ్‌పై ఘన విజయం సాధించింది. ఉత్తరాఖండ్ కేవలం ఒక గోల్ మాత్రమే చేసింది. తమిళనాడు-తెలంగాణ రాష్ట్రాల మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు 7 గోల్స్ సాధించి విజయం కైవసం చేసుకుంది. తెలంగాణ ఒక గోల్ కూడా చేయలేదు. అస్సాం - సిక్కిం రాష్ట్రాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అస్సాం 5-1తో జయకేతనం ఎగురవేసింది. హిమాచల్ ప్రదేశ్- లక్షద్వీప్ మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది.

### యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన దుర్గేష్

**బొమ్మనహాళ్:** మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో బోయ దుర్గేష్ (21) అనే యువకుడు బుధవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బొమ్మనహాళ్ పోలీసులు తెలిపిన మేరకు.. దుర్గేష్‌కు కణేకల్లు మండలం బెణికల్లు గ్రామానికి చెందిన మణి అనే యువతితో రెండేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా ఇద్దరి మధ్య కలహాలు ఏర్పడ్డాయి. మంగళవారం భార్య మణి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బోయ దుర్గేష్ చీరతో రేకుల షెడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్‌ను పరిశీలిస్తున్న ఏపీసీ నాగరాజు

**అనంతపురం ఎడ్యుకేషన్:** సమగ్ర శిక్ష సహిత విద్య విభాగంలో ఖాళీగా ఉన్న రిసోర్స్ పర్సన్ పోస్టులకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం ముగిసింది. రెండోరోజు 19 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రెండు బృందాలు అభ్యర్థుల సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలించారు. సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు ఐఈడీ కోఆర్డినేటర్ షమా పర్యవేక్షించారు. తొలిరోజు ఎంఆర్ అభ్యర్థులు, రెండోరోజు వీఐ/హెచ్ఐ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీసీ నాగరాజు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా జాబితాను ఎస్పీడీ కార్యాలయం నుంచి పంపారన్నారు. ఆ జాబితా మేరకు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించామన్నారు. కొందరు అవగాహన లేకనో, నెట్‌సెంటర్ల పొరబాట్ల వల్లలే తప్పుగా నమోదైన వివరాలను ఇప్పుడు సరిచేస్తున్నామన్నారు. ఇవన్నీ పూర్తిస్థాయిలో పరిశీలించి జాబితాను రాష్ట్ర అధికారులకు పంపుతామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

# స్తంభించిన తపాలా సేవలు



అనంతపురం హెడ్ పోస్టాఫీసు ఎదుట బైఠాయించిన తపాలా ఉద్యోగులు

**అనంతపురం సిటీ:** గ్రామీణ తపాలా ఉద్యోగుల ఒక రోజు సమ్మెతో బుధవారం జిల్లాలో సేవలు స్తంభించిపోయాయి. బ్యాగులు తీసుకురావడం, తీసుకుపోవడం నిలిపివేయడంతో సబ్ పోస్టాఫీసుల్లో పేరుకుపోయాయి. బ్రాంచ్ పోస్టాఫీసుల తలుపులు కూడా తెరవలేదు. సబ్ పోస్టాఫీసుల ఎదుట షామియానాలు వేసి ఉద్యోగులు నిరసన తెలిపారు. జిల్లాలో 405 బ్రాంచ్ పోస్టాఫీసుల ఉద్యోగులు 57 సబ్ పోస్టాఫీసుల ఎదుట సమ్మెకు దిగారు. హిందూపురం పోస్టల్ డివిజన్‌లోని 421 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో పని చేసే సిబ్బంది 68 సబ్ పోస్టాఫీసుల ఎదుట ఆందోళన చేశారు.

**సమ్మె సక్సెస్..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాము తలపెట్టిన సమ్మె విజయవంతమైనట్లు ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ సర్కిల్ కార్య నిర్వాహక కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ తెలిపారు. అనంతపురం హెడ్ పోస్టాఫీసు ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తమ 11 ప్రధాన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు బుధవార ఉమ్మడి జిల్లాలోని 826 బ్రాంచ్ పోస్టాఫీసులు మూతపడ్డాయన్నారు. సుమారు 1,600 మంది ఉద్యోగులు విధులు బహిష్కరించారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఇప్పటి వరకు శాంతియుతంగా నిరసనలు కొనసాగించామని, డిమాండ్లు నెరవేర్చకపోతే ఇకపై పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

# మట్కా మాఫియాపై ఉక్కు పాదం

- ఎస్పీ అన్బురాజన్



**అనంతపురం క్రైం:** జిల్లాలో మట్కా మాఫియాపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మట్కా మాఫియాను జిల్లా నుంచి బహిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మట్కా జరుగుతున్న ప్రాంతాలు, ఇళ్లు, దుకాణాలపై దాడులు జరపాలని పోలీసులను ఆదేశించారు. ఎక్కువ కేసులు ఉండి తరచూ మట్కా కొనసాగిస్తుంటే జిల్లా దాటించేందుకు రంగం సిద్ధం చేయాలన్నారు. పాత కేసు ఉండి మళ్లీ మట్కాతో సంబంధాలు కొనసాగిస్తే రౌడీషీట్ కూడా ఓపెన్ చేయనున్నట్లు తెలిపారు. మట్కాను ప్రోత్సహించినా చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. మట్కా జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్పీ సూచించారు. మట్కా ఆడిస్తున్న వారితో సంబంధమున్న ఓ హోంగార్డును సస్పెండ్ చేశామన్నారు.

**సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం**

జిల్లాలోని సివిల్, ఏఆర్ పోలీసు సిబ్బంది సమస్యలపై ఎస్పీ అన్బురాజన్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పరిష్కారంపై దృష్టి సారించారు. విధులు చేయించుకోవడమే కాదు వారి సంక్షేమం కూడా ముఖ్యమని తెలిపారు. జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలోని సివిల్, ఏఆర్ పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో, వ్యక్తిగతంగా సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై ఆరా తీశారు. నిబంధనలు అనుసరించి పరిష్కరిస్తానని ఎస్పీ తెలియజేశారు.

# భారీగా రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో విజిలెన్స్ అధికారులు

**గుత్తి రూరల్:** మండలంలోని పెద్దొడ్డి గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 61.50 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని బుధవారం అనంతపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పెద్దొడ్డికి చెందిన తపిల చిరంజీవి మండలంలోని పలు గ్రామాల్లో కార్డుదారులు తెచ్చుకున్న బియ్యం కొనుగోలు చేసి తన ఇంట్లో నిల్వ ఉంచుకున్నాడు. పక్కా సమాచారంతో బుధవారం ఉదయం 6.30 సమయంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. చిరంజీవి ఇంట్లో తనిఖీలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 117 బస్తాల్లోని 61.50 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. గుత్తి సీఎస్‌డీటీ సూర్యనారాయణకు అప్పగించారు. చిరంజీవిపై రెవెన్యూ చట్టం 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు. విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, ఏఈ కుల్లాయిరెడ్డి పాల్గొన్నారు.

**గుంతకల్లులో 20 క్వింటాళ్లు..**

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని శ్రీలంక కాలనీలో ఓ ఆటోలో ఉంచిన 20.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని జిల్లా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం విజిలెన్స్ అధికారులు వాసుప్రకాష్, ఫణీంద్రరెడ్డి స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. పీడీఎస్ బియ్యం, ఆటోను సీజ్ చేసి సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మికి స్వాధీనం చేసినట్లు అధికారులు వెల్లడించారు. బియ్యాన్ని తరలిస్తున్న వీరేష్‌బాబు, హనుమంతు, మహేష్‌పై రూరల్ పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయించినట్లు విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు.

### బ్యాంకు ఖాతాలో నగదు మాయం

**గార్లదిన్నె:** ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైన సంఘటన మండల పరిధిలోని కల్లూరులో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సుధాకర్‌కు కల్లూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు అనంతపురం కెనరా బ్యాంకులో ఖాతా ఉంది. రెండు రోజుల క్రితం స్టేట్ బ్యాంకు ఖాతాలోని రూ. 1,600, కెనరా బ్యాంకు ఖాతాలోని రూ.4,400 డ్రా చేసినట్లు మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. సుధాకర్ బ్యాంకులకు వెళ్లి విచారణ చేస్తే డ్రా చేసినట్లు సిబ్బంది తెలిపారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

### జూదరుల అరెస్ట్

**గుంతకల్లు:** చింతలంపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న 13 మందిని బుధవారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. రూ.71,230 నగదుతో పాటు 11 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. ఎస్పీ అన్బురాజన్, డీఎస్పీ నరసింగప్ప ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

# జీవాల మందపై దూసుకెళ్లిన లారీ



ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు, మేకలు



ప్రమాద ఘటనపై ఆరా తీస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

**రాయదుర్గం రూరల్:** లారీ దూసుకెళ్లడంతో 11 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. మండలంలోని కదరంపల్లి గ్రామం టోల్ గేట్ వద్ద బుధవారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బొమ్మనహాళ్ మండలం గోనెహాళ్ గ్రామానికి చెందిన తిప్పేస్వామి, సోమిరెడ్డి, పర్వతయ్య, గంగమూర్తిలు గొర్రెల కాపరులు. మేత కోసం బుధవారం గుండ్ల పల్లి క్రాస్ మీదుగా ప్రధాన రహదారి గుండా రాయదుర్గం వైపు గొర్రెలు, మేకలు తోలుకుని వస్తున్నారు. ఆ సమయంలో అనంతపురం వైపు నుంచి ఇసుకతో కర్ణాటక వైపు వెళుతున్న 16 చక్రాల లారీ మందపై దూసుకెంది. ఘటనలో 5 గొర్రెలు, 6 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. 12 జీవాలు తీవ్రంగా గాయపడ్డాయి. వెటర్నరీ వైద్యులు డాక్టర్ శిరీష, డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని గాయపడిన జీవాలకు చికిత్సలు అందించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి బాధిత కాపరులను పరామర్శించారు. లారీకి ఇన్సురెన్స్ ఉంటే గొర్రెల కాపరులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఘటనపై గొర్రెల యజమాని సోమేశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు డ్రైవర్ వెంకటేశ్వర్ రెడ్డిపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నూర్ మహమ్మద్ తెలిపారు.

# కరువునేలలోనూ సిరుల పంట ఆముదం



వేపకుంటలో ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

- తీవ్ర వర్షాభావంలోనూ దిగుబడులు సాధ్యం
- వేరుశనగతో పాటు అంతర్ పంటగా సాగు చేసుకుంటే మేలు
- భారత నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు

**కనగానపల్లి/ఆత్మకూరు:** వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనే ప్రాంతాల్లోనూ రైతులకు ఆముదం పంట సిరులు కురుపిస్తోందని భారత నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు తెలిపారు. భారత నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ మాథూర్, ఆముదం పంట ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ లావణ్య, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ జవహర్‌లాల్ జాటోత్, డాక్టర్ మంజునాథ్, రేకుల కుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, శాస్త్రవేత్తలు రాధిక, పవన్‌కుమార్‌రెడ్డి, పద్మలత, ఆత్మా పీడీ మద్దిలేటి తదితరులు బుధవారం ఆత్మకూరు మండలంలోని సనప, కనగానపల్లి మండలంలోని వేపకుంట గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆముదం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రోన్ ద్వారా ఏ విధంగా ఆముదం పంటకు స్ప్రే చేయాలన్న విషయాలను రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు ఇటీవల ఆముదం సాగుపై దృష్టి సారించారని, అందువల్లే గతంతో పోలిస్తే ఈ ఏడాది ఆముదం సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. అంతర్ పంటగా ఆముదం వేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు.

**ఐసీహెచ్-5 రకంతో అధిక దిగుబడి..**

ఐసీఏఆర్ ఆధ్వర్యంలో నడిచే భారత నూనె గింజల పరిశోధన సంస్థ తయారు చేసిన ఐసీహెచ్-5 రకం ఆముదం విత్తనంతో అధిక లాభాలు సాధ్యమవుతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ వంగడం నెల రోజుల పాటు వర్షం లేకున్నా దిగుబడి ఇవ్వగలదన్నారు. అంతేకాకుండా మెట్ట పొలాల్లో ఈరకం వంగడం బాగా దిగుబడి ఇస్తుందన్నారు. గుజరాత్‌లో ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని, మన నేలల్లో ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని పరిశోధకులు తెలియజేశారు. ఐసీహెచ్-5 వంగడం ఆముదం 95 నుంచి 110 రోజుల్లో కోతకు వస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.5 వేలకుపైగా పలుకుతోందని తెలిపారు. అనంతరం రైతులతో కలసి ఆముదం పంటలో యాంత్రీకరణ యాజమాన్యం పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఆలుమూరు సుబ్బారెడ్డి, ఏడీఏ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి సుచరిత, ఎంపీఈఓ నాగమణి, ఆషు తదితరులు పాల్గొన్నారు.

# బియ్యంతో మోసం చేశారని కపటనాటకం

**అనంతపురం క్రైం:** బియ్యంతో తమను మోసం చేసిన వారి ఆట కట్టించాలని భావించిన ఓ జంట కపటనాటకానికి తెరతీసింది. అనంతపురం నాల్గవ పట్టణ పోలీసులను పరుగులు పెట్టించింది. పోలీసులు కుటిల ప్రశ్నలు వేయడంతో చివరికి నీళ్లు నమిలి తమ నాటకాన్ని బయటపెట్టారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం మంగళవారి కాలనీలో నివాసం ఉంటున్న టైలర్ పుష్పలత, బార్బర్ నాగభూషణం దంపతులు. బుధవారం తెలిసిన వారితో సోనామసూరి బియ్యం కొనుగోలు చేశారు. వారు వెళ్లిపోయిన తర్వాత బియ్యం పరీక్షిస్తే సోనామసూరి కాదని స్టోర్ బియ్యాన్ని పాలిష్ పట్టి విక్రయించారని గుర్తించారు. బియ్యం అమ్మిన వారికి ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో బియ్యం వ్యాపారులపై ఎలాగైనా కేసు పెట్టాలని పుష్పలత ప్లాన్ వేసింది. తన భర్తను పిలిచి చైన్ స్నాచింగ్ జరిగినట్లు పోలీసులకు ఫోన్ చేస్తే పని సులువవుతుందని స్కెచ్ వేసింది. అనుకున్నదే తడవుగా పోలీసులకు ఫోన్ చేసింది. బియ్యం వ్యాపారులుగా ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తన భార్య మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయారని నాగభూషణం వారికి తెలిపాడు. నాల్గవ టౌన్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. దంపతుల మాటల్లో తేడా రావడంతో అనుమానం వచ్చి ఆరా తీయడం మొదలుపెట్టారు. బంగారు గొలుసు ఎవరు లాక్కెళ్లారు, ఎలా వెళ్లారు అంటూ ప్రశ్నలు కురిపించడంతో నీళ్లు నమిలిన దంపతులు ఎట్టకేలకు నిజం ఒప్పుకున్నారు. భార్య చెప్పమనడంతో చెప్పాల్సి వచ్చిందని నాగభూషణం అసలు విషయం బయట పెట్టాడు. పోలీసులు మందలించి వెనుదిరిగారు.

## క్లుప్తంగా

### ఈ-కేవైసీతోనే పథకాల వర్తింపు



సనప గ్రామం వద్ద ఈ-కేవైసీ చేస్తున్న ఏడీఏ రవి, వ్యవసాయ సిబ్బంది

**ఆత్మకూరు:** పంటలు ఈ-క్రాప్ చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలని, లేకపోతే ప్రభుత్వం అందించే పథకాలు వర్తించవని ఏడీఏ రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన వ్యవసాయ అధికారులతో కలసి మండలంలోని సనపలో రైతులతో ఈ-కేవైసీ చేయించారు. మండలంలో 5,300 మంది రైతులుండగా, 1,400 మంది రైతులు మాత్రమే ఈ-కేవైసీ చేయించారని, ఇంకా దాదాపు 4 వేల మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. అలాగే ఖరీఫ్‌లో పంటలు ఇంకా ఈ-క్రాప్ బుకింగ్‌కు చేయించని రైతులు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుచరిత, ఎంపీఈఓలు నాగమణి, ఆషు తదితరులు పాల్గొన్నారు.

### రిటైర్డు ఏఓ కోకిల భాస్కర్ మృతి



భాస్కర్ (ఫైల్)

**రాప్తాడురూరల్:** న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)గా పని చేస్తూ రిటైర్డ్ అయిన కోకిల భాస్కర్ (61) గుండెపోటుతో మృతి చెందారు. బంధువులు, స్నేహితులు తెలిపిన వివరాల మేరకు...కోకిల భాస్కర్ నగర శివారు రుద్రంపేట పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్నారు. రోజులాగానే మంగళవారం రాత్రి భాస్కర్ మేడపై నిద్రపోయారు. కుటుంబ సభ్యులు కింది ఇంటిలో నిద్రపోయారు. అర్ధరాత్రి గుండెపోటు రావడంతో భాస్కర్ కిందకు దిగే ప్రయత్నం చేశారు. మెట్లు దిగే క్రమంలో జారి అక్కడే పడిపోయారు. తెల్లవారేదాకా ఎవరూ చూసుకోలేదు. కుటుంబ సభ్యులు ఇంటిపైకి వెళ్లాలని చూస్తే భాస్కర్ విగతజీవిగా కనిపించారు. ఈయనకు భార్య మేరీ విజయ, కుమారుడు, కూతురు ఉన్నారు. భాస్కర్ ఉద్యోగం చేస్తూనే లా కోర్సు పూర్తి చేశారు. రిటైర్డ్ తర్వాత లా ప్రాక్టీస్ చేస్తూ వచ్చారు. బార్ అసోసియేషన్‌లో సభ్యుడిగా కూడా ఉన్నారు. సమాచారం అందుకున్న స్నేహితుడు పూలకుంట సర్పంచ్ కాటప్పగారి కృష్ణారెడ్డి హుటాహుటిన ఇంటికి చేరుకుని భాస్కర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాగా భాస్కర్ బామ్మర్దులు సురేష్ తహసీల్దార్‌గా, జాన్‌పాల్ ఆర్డీఓగా పని చేస్తున్నారు.

### 119 మందిపై కేసు నమోదు

**కనగానపల్లి:** అనుమతి లేకుండా బహిరంగ ర్యాలీ నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన 119 టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండల కేంద్రం కనగానపల్లిలో బుధవారం మాజీ మంత్రి పరిటాల సునీత, శ్రీరామ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు అనుమతి లేకుండా వారు మైకులతో గ్రామంలో బహిరంగ ర్యాలీ నిర్వహించారు. దీనిని అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులను కూడా తోసిపుచ్చారు. దీంతో ఈ ర్యాలీలో పాల్గొన్న పరిటాల సునీత, శ్రీరామ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, మండల నాయకులు నెట్టం వెంకటేశులు, ముకుందనాయుడుతో కలిపి సుమారు 119 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

### మట్కా బీటరు అరెస్ట్

**అనంతపురం క్రైం:** నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రామనగర్ 80 అడుగుల రోడ్డు సమీపంలో మట్కా బీటరు రమేష్‌ను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద మట్కా పట్టీలతో పాటు రూ.1,05,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

### ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు



సీఐని సన్మానిస్తున్న దృశ్యం

**అనంతపురం:** విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి సూచించారు. బుధవారం అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు ర్యాగింగ్ నివారణపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా సీఐ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సహచరులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రుషేంద్ర బాబు, కళాశాల చైర్మన్ అనంత రాముడు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రావు భోకలే తదితరులు పాల్గొన్నారు.

# మరో 20 ఏళ్లు జగనన్నే సీఎం

- బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉన్నారు
- అందుకే మళ్లీ ఆయనే రావాలి
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



శిక్షణ కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, గృహసారథులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**రాప్తాడురూరల్:** 'పేదల పక్షాన నిలబడ్డారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారు. కోట్ల రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. వారి అప్పులు తీర్చుతున్నారు. మరోవైపు వారికి ఆస్తులు కూడబెడుతున్నారు. అందుకే మళ్లీ ఏపీకి జగన్ కావాలి' అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కళ్యాణ మంటపంలో 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమంపై గృహసారథులు, పార్టీ నాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. అధికారులే నేరుగా ఇంటింటికీ వెళ్తా ప్రజల అవసరాలు తీర్చుతున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు తన హయాంలో ధనికుల పక్షాన నిలబడ్డారన్నారు. తన అనయాయులు, బినామీల ఖాతాల్లో ప్రజాధనాన్ని జమ చేశారన్నారు. తప్పు చేసింది చంద్రబాబు.. నష్టపోయింది ప్రజలు అని అన్నారు. అమరావతి పేరుతో కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారన్నారు. హెరిటేజ్ కంపెనీతో పాడి రైతుల కష్టాన్ని దోచుకున్నారన్నారు.

**పథకాలను వివరించండి**

పార్టీ నాయకులు, గృహసారథులు, కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సూచించారు. 2024 ఎన్నికలు సమీపిస్తున్నాయని, పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మరో 20 ఏళ్లు జగనన్నే సీఎం అని స్పష్టం చేశారు. పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారం కోసం టీడీపీ నాయకులు విష ప్రచారానికి తెర తీస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు రాధమ్మ, దుగుమర్రి గోవిందరెడ్డి, నాయకులు ధనుంజయయాదవ్, రంగంపేట గోపాల్‌రెడ్డి, బండి పవన్, ఆలమూరు సుబ్బారెడ్డి, మతం శ్యాంసుందర్, ఓబుగారి హరినాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు పాల్గొన్నారు.

### బండారు దిష్టిబొమ్మ దహనం



బండారు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

**అనంతపురం కార్పొరేషన్:** మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ టీడీపీకి చెందిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణ దిష్టిబొమ్మను బుధవారం అనంతపురం టవర్‌క్లాక్ వద్ద దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ మహిళలను కించపర్చడం టీడీపీ నైజమని విమర్శించారు. మంత్రి రోజాపై బండారు వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనూ మహిళా అధికారులను, మహిళలను ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు. మహిళల జోలికొస్తే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకురాళ్లు శోభారాణి, శోభాబాయి, రాధాయాదవ్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

### గొర్రెల పెంపకంపై నేడు అవగాహన సదస్సు

**బుక్కరాయసముద్రం:** స్థానిక చెరువు కట్ట వద్ద ఉన్న షిర్డీసాయి కల్యాణ మండపంలో గురువారం జాతీయ లైవ్ స్టాక్ మిషన్(గొర్రెల పెంపకం)పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పశుశాఖ ఏడీ డాక్టర్ రత్న కుమార్ తెలిపారు. సదస్సుకు బ్యాంక్ అధికారులు, అధికారులు హాజరవుతున్నారన్నారు. బీకేఎస్, శింగనమల, నార్పల మండలాలకు చెందిన నిరుద్యోగ యువత, రైతులు పాల్గొనాలని కోరారు.

### రక్షణగోడ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న మేయర్ వసీం

**అనంతపురం కార్పొరేషన్:** నగరంలోని ఐదో డివిజన్ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.38 లక్షలతో ఏర్పాటు చేయనున్న కాలువ రక్షణ గోడకు మేయర్ వసీం బుధవారం భూమి పూజ చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారం, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కృషితో తమ పాలకవర్గం హయాంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, డీఈ శేఖర్, ఏఈ శంకర్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు జయలలిత, సుజాత, సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, సాకే చంద్రకళ, వైఎస్సార్‌సీపీ నాయకులు పవన్, యోగి తదితరులు పాల్గొన్నారు.

**ఇంటింటి సర్వే పరిశీలన**

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఒకటో డివిజన్‌లో జరుగుతున్న ఇంటింటి సర్వేను మేయర్ వసీం బుధవారం పరిశీలించారు. ఆయన వెంట కార్పొరేటర్లు లాలు, సైఫుల్లా బేగ్, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి, డాక్టర్ రోహిత్, తదితరులు ఉన్నారు.

## సురక్ష.. ప్రజల ఆరోగ్యానికి రక్ష



వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం రూరల్:** 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం ఏ.నారాయణపురం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి గ్రామ, వార్డుల పరిధిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. గతంలో వైద్యం చేయించుకోవాలంటే ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. 108, 104 సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిత్యం వైద్యం అందేలా సదుపాయాలను మెరుగుపరిచారని తెలిపారు. సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శ్రుతి, హాజీవలి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, నాయకులు మల్లెల వేణుగోపాల్, ఉమ్మడి జగన్‌మోహన్‌రెడ్డి, బి.మదన్‌మోహన్‌రెడ్డి, సత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

**వలంటీర్ కుటుంబానికి రూ.5 లక్షల సాయం**

నగరంలోని 35వ డివిజన్‌లో వార్డు వలంటీర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన ప్రశాంతి కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థికసాయం విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం మృతురాలి భర్త నల్లప్పరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నాయకులు లోకనాథ్ రెడ్డి, శ్రీదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ వెలికితీసేందుకే పోటీలు



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో బీఎస్ఎన్ఎల్ అధికారులు, ఉపాధ్యాయులు

**అనంతపురం సిటీ:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా వివిధ రకాల పోటీలు నిర్వహించామని బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా అన్నారు. బీఎస్ఎన్ఎల్ డే వేడుకల్లో భాగంగా ఇటీవల అనంతపురంలోని పలు విద్యా సంస్థల్లోని చిన్నారులకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను బహుమతులకు ఎంపిక చేశామన్నారు. అనంతపురంలోని ద్వారకానగర్ నారాయణ టెక్నో స్కూల్ విద్యార్థిని కె.తనూజ ప్రథమ బహుమతి కింద రూ.599 విలువ చేసే ఎఫ్‌టీటీహెచ్ బ్రాడ్‌బ్యాండ్ ఏడాది కాలపరిమితి కలిగిన కాంప్లిమెంటరీ సర్వీస్‌కు ఎంపికైందన్నారు. నారాయణ ఈ టెక్నో స్కూల్ విద్యార్థి సనా అలీనా ఖాన్‌కు ద్వితీయ బహుమతి కింద ఆరు నెలల ప్యాకేజీ, శ్రీచైతన్య పాఠశాల ఐదో తరగతి విద్యార్థి సాయిచరణ్‌కు తృతీయ బహుమతి కింద మూడు నెలల ప్యాకేజీ సేవలు ఉచితంగా అందించనున్నట్లు జీఎం ముజీబ్ పాషా ప్రకటించారు. కార్యక్రమంలో డీజీఎం బాలగంగాధర్‌రెడ్డి, ఏజీఎం బాలాజీ సహా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాతు.. భలే ముచ్చట బాసూ!



అనంతపురం శివారులోని వడియంపేట వద్ద వరిమడుల్లో బాతులు ఆహారం కోసం అన్వేషిస్తున్న దృశ్యాలు చూడముచ్చటగా ఉంటున్నాయి. క్రమపద్ధతిలో వెళుతూ ఆహారాన్ని వెతుక్కుంటున్నాయి. అటువైపు వెళ్తున్న వారు వీటిని ఆసక్తిగా గమనిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



## ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం



గొందిరెడ్డిపల్లిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**రాప్తాడు:** సంపూర్ణ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గొందిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా హెల్ప్ డెస్క్, స్పాట్ రిజిస్ట్రేషన్, కేస్ షీట్ కౌంటర్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్, మందుల పంపిణీ కౌంటర్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న గొప్ప సంకల్పంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. నిరుపేదలూ ధనవంతుడితో సమానంగా వైద్య సేవలు పొందేలా దివంగత నేత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూపొందించారని, నేడు సీఎం జగనన్న ఆరోగ్యశ్రీని మరింత పకడ్బందీగా అమలు చేయడంతో పాటు నిరుపేదలకు ఇళ్ల వద్దే వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీలో సుమారు 3 వేలకు పైగా వ్యాధులను చేర్చి పేదవాడికి మరింత ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులకు అవసరమైన ఏడు రకాల పరీక్షలు చేసి, వారి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం మెడికల్ క్యాంపు వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో పాటు ఐదేళ్లలోపు చిన్నారులకు సైతం సంపూర్ణ పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, మండల ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరమ్మ, తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, వైద్యాధికారి శ్రావణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, కొండారెడ్డి, వివేకానంద రెడ్డి, ఏడీఏ రవి, ఏఓ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆర్‌బీకే, సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభం**

గొందిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆర్బీకే వద్ద రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత గొందిరెడ్డిపల్లి చెరువుకు ఏటా నీళ్లు ఇస్తున్నానన్నారు.

### అభాగ్యునికి 'అమ్మ' చేయూత



సాయికి ఆర్థికసాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

**అనంతపురం కల్చరల్:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న ఓ అభాగ్యుడికి 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. రాప్తాడు మండలానికి చెందిన రామాంజనేయులు, ప్రభావతమ్మ దంపతులు కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి పాతికేళ్ల కుమారుడు సాయి నగరంలోని ఓ కంపెనీ షోరూమ్‌లో మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కానీ రెండు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి ఆస్పత్రిపాలయ్యాడు. కుటుంబ సభ్యులు రూ.3 లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించారు. మరోసారి ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పడంతో దిక్కుతోచని ఆ కుటుంబం అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి సాయం కోరింది. స్పందించిన ఆయన రూ.40 వేల నగదుతో పాటూ రూ.10 వేలు విలువ చేసే వీల్ చైర్ అందించారు. మందుల కోసం అయ్యే ఖర్చును కూడా భరిస్తానని భరోసా ఇచ్చాడు. మరింత మంది మానవతామూర్తులు ముందుకు వచ్చి సాయిని ఆదుకోవాలని కోరారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- పంచాయతీ సెక్రటరీలకు ఎంపీడీఓ రఘునాథ్ ఆదేశం



రఘునాథ్‌కు స్వాగతం పలుకుతున్న పంచాయతీ సెక్రటరీలు

**ఆత్మకూరు:** ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని నూతన ఎంపీడీఓ రఘునాథ్ పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. డి.హీరేహాళ్ ఎంపీడీఓగా ఉన్న రఘునాథ్‌ను ఉన్నతాధికారులు డిప్యూటేషన్‌పై ఆత్మకూరుకు పంపగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పలువురు పంచాయతీ సెక్రటరీలు నూతన ఎంపీడీఓను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రఘునాథ్ మాట్లాడుతూ... ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### నేడు ముట్టాలలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

**ఆత్మకూరు:** మండలంలోని ముట్టాల గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటి సర్వే చేసి టోకెన్లు ఇచ్చారని, వారంతా తప్పకుండా సురక్ష శిబిరానికి హాజరు కావాలన్నారు. అలాగే అనారోగ్యంగా బాధపడుతున్న వారెవరైనా సురక్ష శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందవచ్చన్నారు. స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి పరీక్షలు చేస్తారని, అవసరమైతే వారే జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేస్తారని వెల్లడించారు.

### అనంతలక్ష్మి, పీవీకేకే కళాశాలలకు ఎన్‌బీఏ గుర్తింపు

**అనంతపురం:** అనంతపురంలోని అనంతలక్ష్మి, పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) కౌన్సిల్ గుర్తింపు దక్కింది. ఈ మేరకు ఎన్‌బీఏ అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు ఉంచారు. అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ, కంప్యూటర్ సైన్సెస్, పీవీకేకేలో ఈఈఈ, కంప్యూటర్ సైన్సెస్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. పీవీకేకే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ బాబు బుధవారం జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దనను కలిసి వివరాలను తెలియజేశారు.

### సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణింపు



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీరాములు

**అనంతపురం:** సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణిస్తారని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీరాములు తెలిపారు. బుధవారం ఎల్ఎల్‌బీ ఫైనలియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ అత్యున్నత స్థానాలు అధిరోహించినపుడే గురువుకు ఇచ్చే నిజమైన బహుమతి అన్నారు. ఈ మూడు సంవత్సరాల వ్యవధిలో ఏర్పడిన అనుబంధం మరువలేనిదని పేర్కొన్నారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో లక్ష్యాన్ని సాధించాలంటే కృషి చేయాలన్నారు. న్యాయవాద వృత్తి అనేది చాలా పవిత్రమైనదని, విలువలకు కట్టుబడి వృత్తిని కొనసాగించాలని సూచించారు.